Follow: @mahaadaily
REGISTERED NUMBER: APTEL/2014/58382
03-12-2025
ANN తెలుగు
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్
సంపుటి- 22 సంచిక- 344 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD
బుధవారం
WWW.EPAPER.MAHAADAILY.COM




## డీసీసీలు మూడు నెలల్లో పనితనం నిరూపించుకోవాలి

### లేదంటే స్వయంగా తప్పుకోవాలె..

మీనాక్షి నటరాజన్ మాస్ వార్నింగ్


గుజరాత్‌లో ఇదే జరిగింది.. తెలంగాణాలోనూ అదే జరుగుతుంది

కోటిమందికి ఇందిరమ్మ చీరెలు చేర్చే బాధ్యత డీసీసీలదే

ఎవరికి చీర రాలేదన్నా ఊరుకోను

**హైదరాబాద్, మహా :** జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులకు ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ మాస్ వార్నింగ్ ఇచ్చారు. గాంధీభవన్ లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2029లో రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే లక్ష్యంగా డీసీసీ చీఫ్ లు పనిచేయాలని సూచించారు. మూడు నెలల్లో పనితీరు నిరూపించుకోవాలని అన్నారు. లేని పక్షంలో వాళ్లే పదవి నుంచి తప్పుకోవాలని సూచించారు. మిగతా 2లో


టాప్ న్యూస్



## ఇమ్రాన్ ఖాన్ బతికే ఉన్నారు..!

- రావల్పిండి జైల్లో సోదరితో ములాఖత్
- ఉద్రిక్తతల నేపథ్యంలో భేటీకి అనుమతి

02



## కాంగ్రెస్ నరనరాల్లో హిందూ ద్వేషం

- కాంగ్రెస్ అంటే ముస్లిం పార్టీ.. మజ్లిస్ కొమ్ముకాసే పార్టీ
- రేవంత్ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టిన బండి సంజయ్

02




## అధిష్ఠానం ఎప్పుడు ఆదేశిస్తే.. అప్పుడే డీకే సీఎం

- హైకమాండ్ పిలిస్తే ఢిల్లీకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాం
- కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సంచలన కామెంట్స్
- ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కలిసి బ్రేక్‌ఫాస్ట్

02

# పవన్‌పై భగ్గుమన్న తెలంగాణ



## మంత్రులు, నేతల ఫైర్


- తెలంగాణ వాళ్ళ దిష్టి తగిలిందనడంపై ఆగ్రహం.. క్షమాపణలు చెప్పకుంటే ఖబడ్దార్
- ఆంధ్రోళ్ళ దోపిడీ వల్లే.. 60 ఏళ్ళు అణచివేతకు గురయ్యామంటూ కామెంట్స్
- పవన్ క్షమాపణ చెప్పకుంటే.. తెలంగాణలో ఆయన సినిమాలు ఆడవు- మంత్రి కోమటిరెడ్డి
- మ్యాట్నీకే ఎత్తేస్తారు?.. నువ్వేందయ్యా ఆపేది?: మంత్రి కోమటిరెడ్డిపై పేర్ని నాని సెటైర్లు
- పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను వక్రీకరించవద్దని జనసేన విజ్ఞప్తి

కోనసీమకు దిష్టి తగిలింది.. రాష్ట్రం విడిపోవడానికి గోదావరి జిల్లాల పచ్చదనం కూడా కారణమన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాసంఘాలు భగ్గుమంటున్నాయి. దీనిపై తెలంగాణ నేతలు తీవ్ర ఆగ్రహం ప్రదర్శిస్తున్నారు. తెలంగాణ ప్రజల దిష్టి ఏపీకి ఎందుకు తగులుతుందని, పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి కావడం వల్లే ఏపీకి దిష్టి తగిలిందని.. ఆ వ్యాఖ్యలు ఉపసంహరించుకుని బేషరతుగా క్షమాపణలు చెప్పాలని మంత్రులు, నేతలు ఫైరవుతున్నారు. పవన్ కళ్యాణ్‌ను తెలంగాణ నుండి తరిమి కొడతామని, సిగ్గుంటే తెలంగాణ నుండి వెళ్లిపోవాలంటూ పలువురు నేతలు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు.. పవన్ చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి, జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కౌంటర్ ఇచ్చారు. పవన్ కల్యాణ్‌కు సిగ్గుంటే తెలంగాణను వదిలేసి ఆంధ్రాలో ఉండాలని ఒక వీడియోతో బల్మూరి వెంకట్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ నుండి పరిగెత్తించి తరిమి కొడతామని హెచ్చరించారు. గతంలో సినిమాలు ఆడడానికి తెలంగాణ అంటే ఇష్టం అని, ఇప్పుడు డిప్యూటీ సీఎం అవ్వగానే మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నాడని ఆయన అన్నారు. తెలంగాణ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని తెలంగాణ నాయకుల నుంచి డిమాండ్లు వినిపించాయి.

**- మహా, హైదరాబాద్**

### పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను వక్రీకరించవద్దని జనసేన విజ్ఞప్తి

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను వక్రీకరించవద్దని జనసేన పార్టీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. రాజోలు నియోజకవర్గంలో పర్యటించిన సమయంలో రైతులతో ముచ్చటిస్తూ చెప్పిన మాటలను వక్రీకరిస్తున్నారని ఆ ప్రకటనలో జనసేన పేర్కొంది. ఇరు రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం నెలకొన్న తరుణంలో ఇలా మాటలను వక్రీకరించవద్దని విజ్ఞప్తి చేసింది.



- వివరాలు 2లో...

## ముగిసిన రెండో విడత నామినేషన్ల పర్వం

- 4332 సర్పంచ్ స్థానాలకు 12479 నామినేషన్లు
- మూడో విడత నామినేషన్లు నేటి నుంచే స్టార్ట్

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో స్థానిక ఎన్నికల సందడి జోరుగ కొనసాగుతోంది. సర్పంచ్ పదవి దక్కించుకునేందుకు అభ్యర్థులు పోటీపడుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఏకగ్రీవాలు కాగా లక్షల రూపాయలు వెచ్చించి పదవి దక్కించుకుంటున్నారు. కాగా ఇప్పటికే మొదటి దశ నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసిన విషయం తెలిసిందే. ఆ తరువాత పంచాయతీ ఎన్నికలకు రెండో విడత నామినేషన్ల ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. మిగతా 3లో

## ఖమ్మం జిల్లా అభివృద్ధి బాధ్యత నాదే

### ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కంచుకోట

- కృష్ణా, గోదావరి జలాలతో సిరులు కురిపిస్తాం
- ప్రపంచ పటంలో తెలంగాణ రాష్ట్రాన్ని నిలబెడుతున్నాం
- ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలలో దూసుకుపోతున్నాం
- కొత్తగూడెంలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి ప్రారంభోత్సవ సభ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




**భద్రాద్రి కొత్తగూడెం,మహా:** తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన ప్రాంతాన్ని, పదేళ్లు కేవలం కమీషన్లు, నిర్లక్ష్యంతో అన్యాయం చేసిన పాలకులకు మళ్లీ ఓటెందుకు వేయాలి?" అని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నిస్తూ ప్రతిపక్షంపై పవర్ పంచ్ విసిరారు. మంగళవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్తగూడెంలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతూ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరును ఈ సంస్థకు పెట్టడం ద్వారా తెలంగాణ ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చిన నాయకుడికి సముచిత గౌరవం దక్కిందని అన్నారు. పదేళ్లు ప్రధానమంత్రిగా పనిచేసిన మన్మోహన్ సింగ్ దేశాన్ని సంక్షోభం నుంచి ఆకాశమంత ఎత్తుకు తీసుకుపోయారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి కొత్తగూడెం ప్రాంతమే స్ఫూర్తినిచ్చిందని, 1969లో తొలి ఉద్యమం ఖమ్మం నుంచే మొదలైందని మిగతా 2లో



## భారత్ డిజిటల్ సెన్సస్‌కు శ్రీకారం

### 2027లో రెండు దశల ప్రక్రియ

- లోక్‌సభలో వెల్లడి.. విధానాల రూపకల్పన
- మొబైల్ యాప్‌ల ద్వారా డేటా సేకరణ, స్వీయ గణనకు ఆన్‌లైన్ సదుపాయం
- రూ. 13,000 కోట్ల వ్యయం, 34 లక్షల మంది సిబ్బందికి శిక్షణ
- స్వాతంత్ర్యం తర్వాత తొలి సమగ్ర కుల ఆధారిత జనగణన

**న్యూ ఢిల్లీ, మహా:** భారతదేశ జనాభా లెక్కింపు చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది. కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించిన వివరాల ప్రకారం, 2027లో నిర్వహించబోయే జనగణన పూర్తిగా డిజిటల్ పద్ధతిలో జరగనుంది. అంతేకాక, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా ఈ లెక్కింపులో కుల గణనను కూడా నిర్వహించాలని నిర్ణయించడం ఒక చరిత్రాత్మక పరిణామం. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఈ కీలక వివరాలను సభకు సమర్పించారు. మిగతా 3లో



## తెలంగాణ ఫిఫా..

- హైదరాబాద్ లో మరో రెండు అకాడమీలు
- ఫుట్ బాల్ కు అడ్డాగా హైదరాబాద్

03

## రేపు ఆదిలాబాద్‌కు సీఎం రేవంత్

- ఏర్పాట్లు పర్యవేక్షించిన మంత్రి జూపల్లి
- కేపస్సార్ క్యాంపు కార్యాలయంలో నేతలతో సమావేశం
- సభ విజయవంతంపై నేతలతో చర్చలు



వివరాలు 5లో

## దేశమంతా.. తెలంగాణ

- ప్రధాని వద్దకు సీఎం.. ఇతర రాష్ట్రాలకు మంత్రులు
- చంద్రబాబును ఆహ్వానించనున్న కోమటిరెడ్డి
- యోగిని ఆహ్వానించనున్న పొంగులేటి.. గుజరాత్ కు ఉత్తమ్
- కర్నాటక, తమిళనాడుకు మంత్రి శ్రీధర్ బాబు.. మమతాబెనర్జీ వద్దకు సీతక్క
- ముఖ్యమంత్రులులు, ఎంపీలను ఆహ్వానించేందుకు మంత్రులకు బాధ్యతలు

**హైదరాబాద్, మహా:** ఈ నెల 8,9 న జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రత్యేకంగా ఆహ్వానించే బాధ్యతను మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పగించారు. ప్రధానిని స్వయంగా కలిసి ఆహ్వానించనున్న మిగతా 3లో

# పవన్‌పై భగ్గుమన్న తెలంగాణ




## మంత్రులు, నేతల ఫైర్

- తెలంగాణ వాళ్ళ దిష్టి తగిలిందనడంపై ఆగ్రహం.. క్షమాపణలు చెప్పకుంటే ఖబడ్దార్
- ఆంధ్రోళ్ళ దోపిడీ వల్లే.. 60 ఏళ్ళు అణచివేతకు గురయ్యామంటూ కామెంట్స్
- పవన్ క్షమాపణ చెప్పకుంటే.. తెలంగాణలో ఆయన సినిమాలు ఆడవు- మంత్రి కోమటిరెడ్డి
- మ్యాట్నీకే ఎత్తేస్తారు?.. నువ్వేందయ్యా ఆపేది?: మంత్రి కోమటిరెడ్డిపై పేర్ని నాని సెటైర్లు
- పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను వక్రీకరించవద్దని జనసేన విజ్ఞప్తి

కోనసీమకు దిష్టి తగిలింది.. రాష్ట్రం విడిపోవడానికి గోదావరి జిల్లాల పచ్చదనం కూడా కారణమన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాసంఘాలు భగ్గుమంటున్నాయి. దీనిపై తెలంగాణ నేతలు తీవ్ర ఆగ్రహం ప్రదర్శిస్తున్నారు. తెలంగాణ ప్రజల దిష్టి ఏపీకి ఎందుకు తగులుతుందని, పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి కావడం వల్లే ఏపీకి దిష్టి తగిలిందని.. ఆ వ్యాఖ్యలు ఉపసంహరించుకుని బేషరతుగా క్షమాపణలు చెప్పాలని మంత్రులు, నేతలు ఫైరవుతున్నారు. పవన్ కళ్యాణ్‌ను తెలంగాణ నుండి తరిమి కొడతామని, సిగ్గుంటే తెలంగాణ నుండి వెళ్లిపోవాలంటూ పలువురు నేతలు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు.. పవన్ చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి, జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కౌంటర్ ఇచ్చారు. పవన్ కల్యాణ్‌కు సిగ్గుంటే తెలంగాణను వదిలేసి ఆంధ్రాలో ఉండాలని ఒక వీడియోతో బల్మూరి వెంకట్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ నుండి పరిగెత్తించి తరిమి కొడతామని హెచ్చరించారు. గతంలో సినిమాలు ఆడడానికి తెలంగాణ అంటే ఇష్టం అని, ఇప్పుడు డిప్యూటీ సీఎం అవ్వగానే మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నాడని ఆయన అన్నారు. తెలంగాణ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని తెలంగాణ నాయకుల నుంచి డిమాండ్లు వినిపించాయి.

- మహా, హైదరాబాద్



### పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను వక్రీకరించవద్దని జనసేన విజ్ఞప్తి

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను వక్రీకరించవద్దని జనసేన పార్టీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. రాజోలు నియోజకవర్గంలో పర్యటించిన సమయంలో రైతులతో ముచ్చటిస్తూ చెప్పిన మాటలను వక్రీకరిస్తున్నారని ఆ ప్రకటనలో జనసేన పేర్కొంది. ఇరు రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం నెలకొన్న తరుణంలో ఇలా మాటలను వక్రీకరించవద్దని విజ్ఞప్తి చేసింది.

### క్షమాపణ చెప్పకుంటే సినిమాలు ఆడవు
**- మంత్రి కోమటిరెడ్డి వార్నింగ్**

పవన్ వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కౌంటర్ ఇచ్చారు. కోనసీమ గురించి తెలంగాణ ఉద్యమం జరగలేదన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం జరిగిన తెలంగాణ ఉద్యమంపై అవగాహన లేకుండా మాట్లాడారంటూ కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. పవన్ వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. బేషరతుగా క్షమాపణలు చెప్పకపోతే తెలంగాణలో పవన్ కల్యాణ్ సినిమాలు ఆడవు.. రిలీజ్ కావు అంటూ మంత్రి కోమటిరెడ్డి తేల్చి చెప్పారు. పవన్ తెలిసి మాట్లాడాడో, తెలియక మాట్లాడాడో తెలియదు.. కానీ ఆయన వ్యాఖ్యల వల్ల తెలంగాణ ప్రజలు బాధపడుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎంతో నష్టపోయాం. తెలంగాణ వచ్చాక కేసీఆర్ వల్ల నష్టపోయాం.. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాం. చిరంజీవి సూపర్ మ్యాన్ ఆయనకు రాజకీయాలతో సంబంధం లేదు. పవన్ కల్యాణ్ అన్ని తెలుసుకుని మాట్లాడితే మంచిది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్న సమయంలో హైదరాబాద్ ఆదాయం అంతా విశాఖ, కాకినాడ, తిరుపతికే వాడుకున్నారు. తెలంగాణ ప్రజలు దిష్టి కాదు.. ఆంధ్రా పాలకుల వల్ల తెలంగాణ ప్రజలు ఫ్లోరైడ్ నీళ్లు తాగారు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

### పవన్ కల్యాణ్ చేతబడి మాంత్రికుడా
**- మాజీ మంత్రి పేర్ని నాని ఫైర్**

పవన్ కల్యాణ్ సినిమాను మ్యాట్నీకే ఎత్తేస్తారని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. సినిమాటోగ్రఫీ మంత్రి గా తెలంగాణలో పవన్ కల్యాణ్ సినిమాలను ఆపేస్తామన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. పవన్ కల్యాణ్ సినిమాలకు మార్నింగ్ షో తర్వాత జనమేరారని, సినిమాటోగ్రఫీ మంత్రిగా ఆయన ఆపేదేంటి..? వాళ్ళే ఆపేస్తారు అని పేర్ని నాని అన్నారు. సినిమాటోగ్రఫీ మంత్రి వచ్చి పవన్ సినిమాలను ఆపాలా అని నిలదీశారు. ఆయన పిచ్చి సినిమాటోగ్రఫీ మంత్రిలా ఉన్నారని సెటైర్లు వేశారు. పవన్ కల్యాణ్ సినిమాలను కొనుగోలు చేసిన వాళ్లు బికార్లు అయిపోయారన్నారు. ఓ ప్రొడ్యూసర్ ఇప్పటి వరకూ జీఎస్టీ కట్టలేదన్నారు. ప్రభుత్వం నుంచి అడిగిన వాళ్లేలేరని విమర్శించారు. పవన్ కల్యాణ్ మాంత్రికుడా.. దిష్టి తగిలిందని చెప్పడానికి అంటూ ఫైర్ అయ్యారు. పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా మాట్లాడారా, లేక చేతబడి మాంత్రికుడి హోదాలో మాట్లాడారా? అసలు దిష్టి తగలడం అంటే ఏమిటి? రాష్ట్ర విభజన జరిగి తెలంగాణ ఏర్పడటమే దిష్టి తగలడమా? పవన్‌కు చేతబడి విద్యలు కూడా తెలుసేమో" అంటూ పేర్ని నాని ఎద్దేవా చేశారు.

### పిచ్చి మాటలు - మాజీమంత్రి జగదీష్ రెడ్డి

నోరు అదుపులో లేకుండా పిచ్చి మాటలు మాట్లాడే వాళ్లు కూడా ఉపముఖ్యమంత్రులు అవుతున్నారు. పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పి తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. ఎవరు మాట్లాడినా ప్రజాస్వామిక పద్ధతిని పాటించాలని సూచించారు. పవన్ కల్యాణ్ ఇప్పటికైనా తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటే మంచిదని అన్నారు.

### పవన్ వల్లే ఏపీకి దిష్టి

పవన్ కళ్యాణ్‌ను గెలిపించడం వల్లనే ఆంధ్రా ప్రాంతానికి దిష్టి తగిలిందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఫైరయ్యారు. పవన్ కళ్యాణ్ ఇది సినిమా కాదు .. రెండున్నర గంటల స్క్రిప్ట్ చదివి పోవడానికి అంటూ ఫైర్ అయ్యారు.

### పవన్ తలతిక్క మాటలు- మంత్రి వాకాటి ఫైర్

పవన్ తల తిక్క మాటలు మానుకోవాలి. రెండు ప్రాంతాల మధ్య విద్వేషం పెంచే మాటలు సరికాదు. ఏపీలో మైలేజ్ కోసం తెలంగాణపై కామెంట్స్ చేయడమేంటి?. అన్నదమ్ముల్లా విడిపోయాం.. సోదరుల్లా కలిసుందాం అని మంత్రి వాకాటి శ్రీహరి అన్నారు

### అవకాశవాద వ్యాఖ్యలు
**- అద్దంకి దయాకర్**

పవన్ కల్యాణ్ బాధ్యతారహితంగా మాట్లాడారు. అవకాశవాద వ్యాఖ్యలు సరైనవి కాదు. ఆంధ్ర, తెలంగాణ మధ్య చిచ్చుపెట్టేలా పవన్ కామెంట్స్ చేశారు. పవన్ మెచ్యూరిటీ పెంచుకోవాలి. ఏరోటి కాడ ఆపాట పాడటం పవన్‌కు అలవాటు అయింది అని అద్దంకి దయాకర్ విమర్శలు చేశారు. పవన్ కళ్యాణ్ బతుకునేర్పిన పాటలను తెలుగు ప్రజలు పట్టించుకోవద్దు. డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ ఆంధ్రతెలంగాణ మధ్య చిచ్చుపెట్టే విధంగా స్టేట్‌మెంట్ ఇవ్వడం సరికాదన్నారు.

### ప్రధాని మోదీ, చంద్రబాబు స్పందించాలి
**- మంత్రి పొన్నం**

తెలంగాణ బిడ్డలుగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్ స్పందించాలి. ప్రకృతి వైపరీత్యం వస్తే.. అది వదిలేసి మాపై నిందలా?. విశాఖ నుండి తుఫాన్లు వచ్చి మా దగ్గర వర్షా లు పడుతున్నాయి.. మీ దిష్టే మాకు తాకిందని మేం అంటున్నామా?. వివేకంతో మాట్లాడాలి కానీ, సినిమా డైలాగులు పేల్చకూడదు. ప్రధాని మోదీ, చంద్రబాబు కూడా పవన్ వ్యవహారంపై స్పందించాలి అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

## ఇమ్రాన్ ఖాన్ బతికే ఉన్నారు..!

**మహా:** ఆయన పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం, ఉనికిపై నెలకొన్న తీవ్ర ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై గత మూడు వారాలుగా జరుగుతోన్న ప్రచారానికి చివరకు తెరపడింది. ఆయన సోదరి ఉజ్మా ఖానుమ్.. తమ అన్న ఇమ్రాన్‌ను కలిసి క్షేమంగా ఉన్నారని చెప్పారు. దీంతో ఆయన మద్దతుదారులు శాంతించారు. కొద్ది రోజులుగా మాజీ ప్రదానితో కుటుంబసభ్యులు కలవడానికి అనుమతించకపోవడంతో ఆయన మరణించారనే వదంతులు వ్యాపించి, నిరసనలు పెరిగాయి. ప్రభుత్వంపై ఒత్తిడి పెరగడంతో ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై ఆందోళనలు తీవ్రమయ్యాయి. ఈ క్రమంలోనే సోదరిని కలిసే అవకాశం కల్పించారు. 'అల్లాహ్ దయవల్ల అతను బాగానే ఉన్నాడు... కానీ మానసికంగా హింసించడంతో కోపంతో ఉన్నాడు. రోజంతా సెల్‌లో బంధించి. కొద్దిసేపు మాత్రమే బయటకు విడిచిపెడుతున్నారు.. ఎవరితోనూ మాట్లాడనీయం లేదు..'' అని అన్నారు. అలాగే, ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడని పేర్కొంది. మొత్తం సైన్యాన్ని తన గుప్పిట్లో పెట్టుకున్న అసిమ్.., తనకు, ఇతర సైన్యాధిపతులకు, అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీకి జీవితకాల ఇమ్యూనిటీ కల్పించేలా రాజ్యాంగాన్ని తిరిగి రాయించుకున్నాడని ఆమె చెప్పింది.

## అధిష్ఠానం ఎప్పుడు ఆదేశిస్తే.. అప్పుడే డీకే సీఎం



**కర్ణాటక, మహా:** కర్ణాటకలో సీఎం సీటుపై రగడ కొనసాగుతున్న వేళ.. మరోసారి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. మంగళవారం ఉదయం ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నివాసానికి సీఎం సిద్ధరామయ్య వెళ్లారు. అనంతరం డీకే శివకుమార్‌కు సీఎం పదవిపై సిద్ధరామయ్య మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. అధిష్ఠానం ఎప్పుడు ఆదేశిస్తే.. అప్పుడే డీకే సీఎం అవుతారన్నారు. ప్రస్తుతం తమ పార్టీ 2028 ఎన్నికలు, స్థానిక ఎన్నికల పైనే ప్రధానంగా దృష్టిసారించినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలే పార్టీ ప్రధాన లక్ష్యమని ఇరువురు నేతలు పేర్కొన్నారు. అల్పాహారం అనంతరం డీకేతో అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, రైతుల సమస్యలు సహా పలు ఇతర విషయాలపైనా చర్చించినట్లు సిద్ధరామయ్య తెలిపారు. ఈ విషయాల్లో చర్చలు జరపడానికి పార్టీ హైకమాండ్ పిలిస్తే తాము ఇద్దరం ఢిల్లీకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వంలోని నేతలంతా ఐక్యంగా ఉన్నామని.. రాష్ట్రాభివృద్ధి కోసం కలిసి పని చేస్తున్నామన్నారు. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. డిసెంబర్ 8న కాంగ్రెస్ ఎంపీల సమావేశం నిర్వహించడానికి ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

## ఖమ్మం జిల్లా అభివృద్ధి బాధ్యత నాదే

(మొదటిపేజీ తరువాయి)

గుర్తు చేస్తూ, సింగరేణి వంటి సంస్థల అభివృద్ధికి ఈ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఖమ్మం జిల్లా మంత్రులపై తనకున్న నమ్మకాన్ని ఈ సందర్భంగా బహిరంగంగా ప్రకటించారు. తాను రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ, ఖమ్మం జిల్లాకు సంబంధించిన ముఖ్యమైన శాఖలన్నీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వద్దే ఉన్నాయని తెలిపారు. ఈ ముగ్గురు మంత్రులు తలుచుకుంటే జిల్లాలో ఏ పనైనా జరుగుతుందని, అందువల్ల జిల్లా అభివృద్ధి బాధ్యత తనతో పాటు ఈ ముఖ్యమైన బృందానిది కూడా అని స్పష్టం చేశారు. అయితే, అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు, అనుమతులు మంజూరు చేసే బాధ్యత మాత్రం తనదే అని హామీ ఇవ్వడం ద్వారా, జిల్లాపై తన పూర్తి అధికారాన్ని, ప్రేమను తెలియజేశారు. గత పాలకుల వైఫల్యాలను సీఎం రేవంత్‌రెడ్డి గట్టిగా విమర్శించారు. గత పదేళ్ల పాలనలో ఖమ్మం జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని, అవి కమీషన్లు కురిపించాయి తప్ప, పొలాల్లో నీళ్లు పారలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం ఆ పరిస్థితిని మారుస్తుందని, కృష్ణా, గోదావరి జలాలతో ఖమ్మం జిల్లా పొలాల్లో సిరులు కురిపించడానికి ప్రయత్నం చేస్తోందని హామీ ఇచ్చారు.



సీతారామ సహా ఇతర సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, జిల్లాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు.

**స్థానిక సంస్థల ఎన్నికలలో గెలిపించండి**

మంచి ప్రభుత్వం ఉంటేనే ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయని సీఎం వివరించారు. మంచి మంత్రులు ఉన్నప్పటికీ, గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు అందరికీ చేరాలంటే మంచి సర్పంచులు కూడా ఉండాలి అని స్పష్టం చేశారు. కాబట్టి, సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు రాజకీయ కక్షలు మానుకుని, అభివృద్ధి కోసమే ఓటు వేయాలని, ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని ఆయన పిలుపునిచ్చారు. మంచి పాలన అందిస్తున్నామని, తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనకు మరో పదేళ్లు తమ ప్రభుత్వానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా అండగా నిలబడాలని ఆయన ప్రజలను కోరారు. అలాగే, విద్య ద్వారానే తెలంగాణ ఉన్నత స్థానంలో నిలబడుతుందని చెబుతూ, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ వంటి విద్యా సంస్థల స్థాపన ఆ దిశగా జరుగుతున్న ప్రయత్నమని వివరించారు. ఖమ్మం జిల్లాను కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా అభివర్ణించిన సీఎం, గత పదేళ్లలో అన్ని రంగాల్లో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. తమ ప్రభుత్వం ఈ అన్యాయాన్ని సరిదిద్దుతోందని, అందుకే రేషన్‌కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం వంటి ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని ఖమ్మం జిల్లా నుంచే ప్రారంభించామని గుర్తు చేశారు. ఈ జిల్లా అభివృద్ధి బాధ్యత భద్రాద్రి రాముల వారి సాక్షిగా తనదేనని హామీ ఇస్తూ, జిల్లా మంత్రులు ప్రతి పథకాన్ని లబ్ధిదారుని వద్దకు తీసుకు వెళ్తున్నారని ఆయన వారి కృషిని మెచ్చుకున్నారు.

## డీసీసీలు మూడు నెలల్లో పనితనం నిరూపించుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

తప్పుకోనివాళ్లను పార్టీయే తప్పించి వారి స్థానంలో వేరే వారిని నియమిస్తుందని అన్నారు. గుజరాత్ లో ఇదే జరిగిందని, తెలంగాణాలోనూ అదే జరుగుతుందని. అన్నారు. మూడు నెలలు కాకుంటే ఆరు నెలల వరకు అవకాశం ఇస్తామని, కొత్త డీసీసీ చీఫ్ ల పనితీరు బాగా లేకుంటే తప్పించి వేరే వారిని నియమిస్తామని అన్నారు.

**పది రోజుల్లో కార్పొరేషన్ పదవుల భర్తీ: పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్**

వారం పది రోజుల్లో కార్పొరేషన్ చైర్మన్ స్థానాలతో పాటు పెండింగ్ లో ఉన్న పదవులనూ భర్తీ చేస్తామని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం గాంధీభవన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ..స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని




సీఎం జిల్లాల్లో పర్యటిస్తున్నారని చెప్పారు. డీసీసీ పదవి కీలకమైందని, తనకు ఆ అవకాశం రాలేదని అన్నారు. నిష్ణాతులైన ఏఐపీసీ అబ్జర్వర్స్ తో డీసీసీల ఎంపిక జరిగిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి లక్షా 80 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. కేసీఆర్ తన పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. కేసీఆర్ శకం ముగిసిందన్నారు.

## కాంగ్రెస్ నరనరాల్లో హిందూ ద్వేషం

**కాంగ్రెస్ అంటే ముస్లిం పార్టీ.. మజ్లిస్ కొమ్ముకాసే పార్టీ..రేవంత్ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టిన బండి సంజయ్**

**హైదరాబాద్, మహా:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందువులను, హిందూ దేవుళ్లను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరమని మండిపడ్డారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో, కాంగ్రెస్ పార్టీ నూటికి నూరు శాతం మజ్లిస్ పార్టీకి కొమ్ముకాసే పార్టీ అని, "ముస్లిం అంటేనే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటేనే ముస్లిం పార్టీ" అని రేవంత్ రెడ్డి చెప్పడం ఇందుకు తిరుగులేని నిదర్శనమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నరనరాల్లో హిందూ ద్వేషం నింపుకుందని ఆయన ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ కూడా పలుమార్లు హిందూ దేవుళ్లను, సంస్కృతిని కించపర్చిందని, మాజీ సీఎం కేసీఆర్ సైతం హిందువులను "హిందుగాళ్లు బొందుగాళ్లు" అంటూ అవహేళన చేశారని బండి సంజయ్ గుర్తు చేశారు. ఈ అంశంపై హిందూ సమాజం ఇకనైనా ఆలోచించుకోవాలి అంటూ బండి సంజయ్ గళమెత్తారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగానే కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్ గెలిస్తే హిందువులు తలెత్తుకుని తిరగలేని ప్రమాదం ఏర్పడుతుందని తాము హెచ్చరించామని, సీఎం రేవంత్ రెడ్డి తాజా వ్యాఖ్యలు ఆ విషయాన్ని నిరూపించాయని తెలిపారు. హిందువుల పట్ల, హిందూ దేవుళ్ళ పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న ద్వేషం బట్టబయలైందని ఆయన వ్యాఖ్యానించారు. హిందూ సమాజం ఇకనైనా మేల్కొని, ఓట్ల కోసం చీలిపోయి అవమానాలను దిగమింగుకుంటూ ఉంటారో, లేక ఏకమై తమ సత్తాను చాటుకుంటారో తేల్చుకోవాలని పిలుపునిచ్చారు. తమ పార్టీ బీజేపి ఏనాడూ ఇతర మతాలను కించపరచలేదని, అన్ని మతాలను గౌరవిస్తుందని, ప్రధాని మోడీ ఆధ్వర్యంలో "సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్" దిశగా పనిచేస్తుందని బండి సంజయ్ స్పష్టం చేశారు.



ANN తెలుగు
# మహా పత్రిక
బుధవారం, తిరుపతి | 03-12-2025 | జనరల్ న్యూస్ | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM


## మూడవ విడత నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**




**యాదాద్రి భువనగిరి, మహా:** సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరిగే మూడవ విడత నామినేషన్ స్వీకరణ ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు యాదాద్రి భువనగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుండి 5వ తేదీ వరకు చౌటుప్పల్, నారాయణ పూర్, అడ్డగూడూర్, మోత్కూర్, గుండాల, మోటకొండూర్ మండలాలకు సంబంధించి 124 గ్రామపంచాయతీలు, 1086 వార్డులకు జరిగే మూడవ విడత నామినేషన్ ప్రక్రియ కి సంబందించి అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది. 5 గంటలకు నామినేషన్ కేంద్రం గేటు మూసివేయాలని, నామినేషన్ కేంద్రంలో ఉన్న అభ్యర్థుల నుండి మాత్రమే నామినేషన్లు స్వీకరించాలని, ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ప్రక్రియ ను త్వరగా పూర్తి చేసేలా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎన్నికల నిర్వహణ లో అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ కేంద్రం నుండి 100 మీటర్ల పరిధిలో గుంపులుగా ఎవరిని అనుమతించరని.. నామినేషన్ సమర్పించే అభ్యర్థులు, ప్రతిపాదించే వారికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల సంఘం జారీ చేసిన నియమాలకు లోబడి వ్యవహరించాలని, నామినేషన్ పత్రాల స్వీకరణ, నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపు ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులకు కలెక్టర్ తెలిపారు.

## నామినేషన్ల ప్రక్రియ పరిశీలించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**భువనగిరి, మహా:** నామినేషన్ స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగానిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి హనుమంత రావు అన్నారు. మంగళవారం గ్రామపంచాయతీ ఎన్నికల రెండవ విడత నామినేషన్ లో భాగంగా బీబీనగర్ మండలం గూడూరు క్లస్టర్, మరియు బీబీనగర్ క్లస్టర్ లో నామినేషన్ ల ప్రక్రియ ను కలెక్టర్ పరిశీలించారు ఈరోజు రెండవ విడత నామినేషన్ చివరి రోజున ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నందున, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.సాయత్రం 5 గంటల లోపు నామినేషన్ కోసం కేంద్రంలోకి వచ్చిన వారి అందరికీ టోకెన్ సిస్టం ద్వారా నామినేషన్ లు స్వీకరించాలి. 5 గంటల తర్వాత వచ్చిన వారికి నామినేషన్ వేసే అవకాశం లేదని అన్నారు.పోలీస్ బందోబస్తు ను ఏర్పాటు చేసుకొని సాయత్రం 5 గంటల తర్వాత బారికేడ్ లను ఏర్పాటు చేసి మూసి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భూభారతి దరఖాస్తులు పెండింగ్ పెట్ట వద్దు... జిల్లా కలెక్టర్



**భువనగిరి, మహా:** భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలు పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. మంగళవారం బీబీనగర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతిలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులని కలెక్టర్ పరిశీలించారు, ఆయా మాడ్యూల్స్ లో వచ్చిన దరఖాస్తులు ఎన్ని, సాదాబైనామా అర్జీలలో ఎన్ని ఆమోదం పొందాయని, ఎన్ని దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి, పీ.ఓ.టీ భూములకు సంబంధించిన దరఖాస్తులు ఎన్ని తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సాదాబైనామా దరఖాస్తులకు సంబంధించి అర్హులైన వారు ఉన్నట్లు గుర్తిస్తే, అలాంటి వారికి తగిన న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. చిన్నచిన్న కారణాల వల్ల దరఖాస్తులను రిజెక్ట్ చేయకూడదని, క్షేత్రస్థాయిలో పక్కాగా పరిశీలన జరిపి అర్హులుగా నిర్ధారణ అయిన వారి దరఖాస్తులను ఆమోదించాలన్నారు. ఈ కార్యక్రమం లో బీబీనగర్ తాసిల్దార్ శ్యాంసుందర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మద్యం సీసాలు పంట పొలాల్లో వెయ్యొద్దు

**సూర్యాపేట జిల్లా ఎస్పి కె. నరసింహ**




**సూర్యాపేట, మహా :** మద్యం తాగి కాలీ సీసాలు కాలువలు, పంట పొలాల్లో వేయడం వల్ల పొలం పనులు,మందు వేసే సమయాల్లో వెళ్తున్న రైతన్నలకు, కూలీలకు గాయాలు అవుతున్నాయని దీనిపై చాలా వినుతులు వస్తున్నాయని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ప్రకటనలో తెలిపారు.బహిరంగా మద్యం సేవిస్తూ కల్వర్టు లు, పంట పొలాల్లో కాళీ మద్యం సీసాలు పడవేయడం మంచి పౌరుల లక్షణం కాదని సూచించారు. కొన్ని సందర్భాల్లో పాఠశాలల్లో కూడా కాలీ మద్యం సీసాలు వేస్తున్న సంఘటనలు పోలీసు దృష్టికి వస్తున్నాయని తెలిపినారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలి. పంట పొలాల్లో గాజు సీసాలు పారవేయవద్దని ఎస్పి విజ్ఞప్తి చేశారు. బహిరంగంగా మద్యం తగేవారి వల్ల వచ్చిపోయే మహిళలు, పిల్లలు ఇబ్బందులు పడుతారు బహిరంగంగా మద్యం తాగడం నేరం, బహిరంగ మద్యం తాగే వారిపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుంది అన్నారు. నిర్మానుష ప్రాంతాలు, క్రీడా మైదానాలు, కాళీ ఇంటి స్థలాలు, కాలువ గట్ల వద్ద పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### టిపోల్ యాప్ లో నామినేషన్ వివరాలను
## సంక్షిప్తంగా నమోదు చేయాలి

**అధికారులను ఆదేశించిన సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యా పేట, మహా:** సూర్యాపేట జిల్లాలోని చిలుకూరు మండలం బెతవోలు, మునగాల మండలం ఆకుపాముల గ్రామ పంచాయతీ కార్యాలయాలలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక కొరకు ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని మంగళవారం సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పరిశీలించారు.ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ కేంద్రాలలో 5 గంటల తర్వాత అభ్యర్థులు ఉంటే వారికి వరుస క్రమంలో టోకెన్లు జారీ చేయాలని ఎక్కువ మంది అభ్యర్థులు ఉంటే మరో నామినేషన్ స్వీకరణ కౌంటర్ ను ఏర్పాటు చేసి నామినేషన్ లను స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 3 నుండి 5 వ తేది వరకు హుజూర్ నగర్ డివిజన్ లోని 7 మండలాల్లో నామినేషన్ స్వీకరణ ప్రక్రియ ప్రారంభవుతుందని ముందస్తుగా అభ్యర్థులు నామినేషన్ కు ఏర్పాట్లు చేసుకుంటే నామినేషన్ ప్రక్రియ సులభంగా పూర్తి అవుతుందని, అన్ని నామినేషన్ కేంద్రాలలో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేశామని అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే అధికారుల ద్వారా తెలుసుకోవాలని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్డిఓ సూర్యానారాయణ, జడ్పీ డిప్యూటీ సి ఈ ఓ శిరీష,తహసీల్దార్ ధ్రువ కుమార్,ఎంపిడిఓ నరసింహారావు, ఆర్ ఓ లు,ఎన్నికల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## టియుడబ్ల్యూజే తలపెట్టిన ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలి

**టీజేఏ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా**



**సూర్యాపేట జిల్లా, మహా :** తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు,సలహాదారు,ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యుడు,ఉప్పల లక్ష్మణ్ సూచన మేరకు టిజేఏ రాష్ట్ర అధ్యక్షుడు కదిరి వెంకటరమణా రావు, రాష్ట్ర కార్యదర్శి ఘోరీ,ఎన్ యూ జే ఐ ఉపాధ్యక్షుడు రాజేంద్రనాథ్ ఆదేశాల మేరకు జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కొరకు బుధవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ సమాచార శాఖ కార్యాలయంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ చేయనున్న ధర్నాకు మద్దతుగా తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టి జే ఏ) కూడా పాల్గొని ధర్నాను విజయవంతం చేయనున్నామని టీజేఏ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అక్రిడేషన్,హెల్త్ కార్డ్స్,ఇన్సూరెన్స్,బస్ పాసులు,ట్రైన్ పాసులు,ఇండ్ల స్థలాలు, ఇండ్లు తదితర సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం లభించాలని టి యూ బ్ల్యూ జే చేయతలపెట్టిన ధర్నాకు, జర్నలిస్టుల సంక్షేమం కోసం అన్ని యూనియన్ లు కలిసి పోరాటాలు చేసినప్పుడు మాత్రమే సమస్యలు పరిష్కరించబడతాయని ప్రభుత్వాలు స్పందించే పరిస్థితులు ఏర్పడతాయని అన్నారు సూర్యాపేట జిల్లా లోని అన్ని మండలాల టి. జే. ఏ.అధ్యక్షులు కమిటీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

# భారత్ డిజిటల్ సెన్సస్‌కు శ్రీకారం

(మొదటిపేజీ తరువాయి)



దేశంలోని ప్రతి కుటుంబ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక స్థితిగతులను అత్యంత ఖచ్చితత్వంతో నమోదు చేయడమే లక్ష్యంగా కేంద్రం ఈ బృహత్తర కార్యక్రమానికి సన్నద్ధమవుతోంది.

**రెండు దశల్లో జనాభా లెక్కింపు**

2027 జనగణన ప్రక్రియ మొత్తం రెండు ప్రధాన దశల్లో పూర్తి చేయబడుతుంది. తొలి దశ, అంటే ఇళ్ల జాబితా మరియు గృహ గణన (హౌస్ లిస్టింగ్), 2026 ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు నిర్వహించబడుతుంది. ఈ దశలో నివాసాల కండీషన్, ఆస్తులు, మౌలిక సదుపాయాల వివరాలను నమోదు చేస్తారు. ఇక రెండో దశ, జనాభా గణన, 2027 ఫిబ్రవరిలో జరుగుతుంది. ఈ దశకు 2027 మార్చి 1వ తేదీని రిఫరెన్స్ తేదీగా నిర్ణయించారు. ఈ దశలో ప్రతి వ్యక్తి సామాజిక, ఆర్థిక, వృత్తిపరమైన వివరాలను సేకరిస్తారు. దేశంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థలు, మరియు డేటా వినియోగదారుల నుంచి వచ్చిన సూచనల ఆధారంగానే తుది ప్రశ్నాపత్రాన్ని రూపొందించనున్నారు.

**టెక్నాలజీతో వేగం, పారదర్శకత**

జనగణన చరిత్రలోనే తొలిసారిగా డిజిటల్ పద్ధతిని అమలు చేయడం ఈ లెక్కింపు యొక్క ప్రధానాంశం. క్షేత్ర స్థాయిలో పనిచేసే 34 లక్షల మంది ఎన్యుమరేటర్లు మరియు సూపర్‌వైజర్లు మొబైల్ యాప్‌ల ద్వారా డేటాను నేరుగా సేకరిస్తారు. ఈ విధానం కాగిత రహితంగా ఉండటమే కాకుండా, డేటా సేకరణలో వేగాన్ని, ఖచ్చితత్వాన్ని పెంచుతుంది. అంతేకాకుండా, ప్రభుత్వం పౌరులకు స్వీయ గణన కోసం ఆన్‌లైన్ సదుపాయాన్ని కూడా కల్పించింది. దీని ద్వారా ప్రజలు తమ వివరాలను ఆన్‌లైన్‌లో స్వయంగా నమోదు చేసుకునే అవకాశం లభిస్తుంది.

**సామాజిక న్యాయం దిశగా ముందడుగు**

ఈ జనగణనలో కుల గణనను నిర్వహించడం అనేది ఒక కీలకమైన చారిత్రక నిర్ణయం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జనాభా లెక్కల్లో కులాల సమాచారాన్ని సేకరించడం ఇదే మొదటిసారి అవుతుంది. చివరి సమగ్ర కుల ఆధారిత లెక్కింపు 1931లో జరిగింది. ఈ కుల గణన ద్వారా లభించే కచ్చితమైన సమాచారం, దేశంలో కులాల వారీగా ఉన్న సామాజిక, ఆర్థిక అసమానతలను అంచనా వేయడానికి ప్రభుత్వానికి సహాయపడుతుంది. తద్వారా సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు మరియు ఇతర విధాన నిర్ణయాలు మరింత లక్షిత వర్గాలకు, అర్హులైన వారికి మాత్రమే చేరే విధంగా రూపొందించడానికి ఈ డేటా ఒక బలోపేతమైన ఆధారంగా నిలుస్తుంది.

**జనగణన కోసం భారీ ఏర్పాట్లు**

ఈ బృహత్తర కార్యక్రమానికి కేంద్రం భారీగా నిధులు కేటాయించింది. 202526 బడ్జెట్‌లో రూ. 574.80 కోట్లు కేటాయించగా, మొత్తం వ్యయం రూ. 13,000 కోట్ల వరకు ఉండొచ్చని అధికారులు అంచనా వేశారు. ఈ ప్రక్రియలో పాల్గొనే 34 లక్షల మంది ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇవ్వడానికి 1,800 మంది మాస్టర్ ట్రైనర్లు మరియు 45 వేల మంది ఫీల్డ్ ట్రైనర్లకు ఇప్పటికే శిక్షణ అందిస్తున్నారు. జనగణన రాజ్యాంగంలోని ఆర్టికల్ 246 ప్రకారం ఏడో షెడ్యూల్‌లోని కేంద్ర జాబితాలో 69వ అంశంగా జాబితా చేయబడింది. ఈ లెక్కలు దేశ భవిష్యత్తు విధానాలకు, ప్రణాళికలకు బలమైన పునాదిని అందించనున్నాయి.

# దేశమంతా.. తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి,ఇతరరాష్ట్రాలసీఎంలు,ఎంపీలనుకలిసి ఆహ్వానించే బాధ్యతను మంత్రులకు అప్పగించారు. ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబును మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆహ్వానించనుండగా, కర్నాటక, తమిళనాడు సీఎంలను శ్రీధర్ బాబు ఆహ్వానించనున్నారు. పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీని మంత్రి సీతక్క ఆహ్వానించనున్నారు. ఉత్తర ప్రదేశ్ యోగి ఆదిత్యానాథ్ వద్దకు పొంగులేటి, ఛత్తీస్ గడ్ కు కొండా సురేఖ, మహారాష్ట్రకు మంత్రి అజారుద్దీన్ వెళ్ళనున్నారు.

**రాష్ట్రాల వారీగా మంత్రులకు బాధ్యతలు:**

జమ్మూ& కశ్మీర్, గుజరాత్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , పంజాబ్, హర్యానా మంత్రి దామోదర రాజనర్సింహ , ఆంధ్రప్రదేశ్ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి , కర్ణాటక, తమిళనాడు మంత్రి శ్రీధర్ బాబు , ఉత్తర్ ప్రదేశ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , రాజస్థాన్ మంత్రి పొన్నం ప్రభాకర్ , ఛత్తీస్ ఘడ్ మంత్రి కొండా సురేఖ , వెస్ట్ బెంగాల్ మంత్రి సీతక్క , మధ్యప్రదేశ్ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు , అస్సాం మంత్రి జూపల్లి కృష్ణారావు , బీహార్ మంత్రి వివేక్ వెంకటస్వామి హిమాచల్ ప్రదేశ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ , ఒడిశా మంత్రి వాకిటి శ్రీహరి , మహారాష్ట్ర మంత్రి అజారుద్దీన్ వెళ్ళనున్నారు. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు,ఎంపీలను కలిసి గ్లోబల్ సమ్మిట్ కు ప్రత్యేకంగా ఆహ్వానం అందించాలని మంత్రులకు బాధ్యతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతలు అప్పగించారు.

# ముగిసిన రెండో విడత నామినేషన్ల పర్వం

(మొదటిపేజీ తరువాయి)

నేటితో రెండో విడత నామినేషన్ల గడువు ముగిసింది. రెండో విడత సర్పంచ్ ఎన్నికల నామినేషన్లలో భాగంగా 4332 సర్పంచ్ స్థానాలకు 12479 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు 38342 వార్డు మెంబర్ స్థానాలకు 30040 నామినేషన్లు దాఖలయ్యాయి. సర్పంచ్, వార్డు మెంబర్ పదవులను ఏకగ్రీవం చేసుకునేందుకు పలువురు గ్రామస్థుల ఆసక్తి కనబరుస్తున్నారు.

**ఏకగ్రీవాలపై ప్రత్యేక దృష్టి..**

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఏకగ్రీవాలపై ప్రత్యేక దృష్టి సారించింది. పదవులకు వేలం పాటలు నిర్వహించడం, బలవంతపు ఏకగ్రీవాలు చేయొద్దని ఎస్ఈసీ సూచించింది. తొలి విడత నామినేషన్ల స్వీకరణలో రెండు రోజుల్లో సర్పంచ్ స్థానాలకు 8198 నామినేషన్లు, 11502 వార్డు మెంబర్ నామినేషన్లు దాఖలు అయినట్లు వెల్లడించారు. మొదటి విడతలో 189 మండలాల్లోని 4,236 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించనున్నది. డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే, అదే రోజు మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు చేపట్టి వార్డు సభ్యులు, సర్పంచుల ఫలితాలను వెల్లడిస్తారు. మూడో విడత నామినేషన్లు డిసెంబర్ 3 నుంచి స్వీకరించనున్నారు.

# ఖర్గేకు అధికారిక ఆహ్వానం

### గ్లోబల్ సమ్మిట్‌కు ఏఐసీసీ అధ్యక్షుడికి ఆహ్వానం..తెలంగాణ గ్లోబల్ విజన్‌కు ఖర్గే ఆశీస్సులు



**ఢిల్లీ, మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిసెంబర్ 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా నిర్వహించనున్న "తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2025"కు ఆహ్వానం అందించేందుకు ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు రావాల్సిందిగా ముఖ్యమంత్రి సముచితంగా ఆహ్వానించారు. ఈ భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల బృందం కూడా పాల్గొంది. ఖర్గేతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ వంటి అగ్రనేతలను కూడా ఈ సమ్మిట్‌కు ముఖ్యమంత్రి ఆహ్వానించనున్నారు. ఈ గ్లోబల్ సమ్మిట్ ద్వారా, తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు ఉద్దేశించిన విజన్ డాక్యుమెంట్‌ను ప్రభుత్వం ఆవిష్కరించనుంది. ఈ సందర్భంగా, రాష్ట్రానికి సంబంధించిన వివిధ అభివృద్ధి అంశాలు, కేంద్ర పథకాలకు సంబంధించిన ఆర్థిక కేటాయింపులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల గురించి కూడా ఏఐసీసీ అధ్యక్షుడితో ముఖ్యమంత్రి చర్చించినట్లు తెలుస్తోంది. తెలంగాణ అభివృద్ధి లక్ష్యాల పట్ల పార్టీ అధిష్టానానికి వివరించి, వారి ఆశీస్సులు పొందడం ఈ భేటీ ప్రధాన ఉద్దేశం.



## గాంధీ కుటుంబాన్ని వేధిస్తే ఊరుకోం..

- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ స్ట్రాంగ్ మెసేజ్
- సంక్షేమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లండి.. డీసీసీ చీఫ్‌లకు సీఎం దిశానిర్దేశం

**హైదరాబాద్, మహా:** టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా అధ్యక్షుల బాధ్యతపై గట్టి హెచ్చరిక చేశారు. "జిల్లా అధ్యక్షుడు అనేది గొప్ప బాధ్యత; నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదు" అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ముఖ్యంగా కోటి మందికి కోటి చీరల పంపిణీ (ఇందిరమ్మ చీరలు) కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత జిల్లా అధ్యక్షులదేనని అన్నారు. డిసెంబర్ నాటికి గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల చీరల పంపిణీ, మార్చి నాటికి పట్టణ ప్రాంతాల్లో 35 లక్షల చీరల పంపిణీ పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. సంక్షోభంలో రాష్ట్రాన్ని చేపట్టి, ఇప్పుడు సంక్షేమం వైపు నడిపిస్తున్నామని, ఈ పరిపాలనపై గ్రామ గ్రామాన చర్చ పెట్టాలని సూచించారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన ఘనత గాంధీ కుటుంబానిదేనని కొనియాడుతూ, సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై పెట్టిన నేషనల్ హెరాల్డ్ కేసులను తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం చేస్తున్నామని ప్రకటించారు. రాష్ట్ర భవిష్యత్తుపై తన విజన్‌ను వెల్లడిస్తూ, 2034 నాటికి రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇందులో భాగంగా, కోర్ అర్బన్ సమస్యలకు 'క్యూర్' (కాలుష్య కారక పరిశ్రమలను ఔటర్ వైపు తరలించడం), పెరి అర్బన్ రీజియన్‌లో పరిశ్రమలకు 'ప్యూర్', రీజనల్ రింగ్ రోడ్ బయట వ్యవసాయాభివృద్ధికి 'రేర్' వంటి కొత్త విధానాలను ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీని అత్యుత్తమ యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు ఈ నెల 7న ఆర్ట్స్ కాలేజీ ముందు సభ పెట్టి నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. అలాగే, 8, 9 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరిస్తామని తెలిపారు. కేంద్రంతో కొట్లాడి హైదరాబాద్‌బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవేతో పాటు బుల్లెట్ ట్రైన్ మంజూరు చేయించుకున్నామని చెబుతూ, మనం చేస్తున్న పనులు, అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, రాహుల్ గాంధీని ప్రధాని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉద్ఘాటించారు. రాజకీయాల్లో ఇబ్బందులు సహజమని, అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు.




సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన
## స్వతంత్ర అభ్యర్థి నీలం నరేందర్

**వలిగొండ, మహా :** వలిగొండ మండల పరిధిలోని గోపరాజుపల్లి సర్పంచి అభ్యర్థిగా నీలం నరేందర్ మంగళవారం స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు ఈ సందర్భంగా నీలం నరేందర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు సజావుగా సాగడం లేదని డబ్బులు ఉంటేనే పోటీ చేయాలనా ఇదెక్కడి న్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు తాను స్వతంత్ర అభ్యర్థిగా నన్ను గెలిపించినట్లయితే గ్రామ సేవకుడిలా పనిచేస్తానని ఒక అవకాశం ఇచ్చి ఆశీర్వదించి గెలిపించాలని ఆయన గ్రామ ప్రజలను కోరారు పార్టీలకు అతీతంగా ఒక అవకాశం ఇవ్వాలని కోరారు

# తెలంగాణ ఫిఫా


## హైదరాబాద్‌లో మరో రెండు అకాడమీలు
## ఫుట్ బాల్ కు అడ్డాగా హైదరాబాద్

**హైదరాబాద్, మహా :** భారత ఫుట్‌బాల్ చరిత్రలో హైదరాబాద్ అనేక అపురూప ఘట్టాలను ఆవిష్కరించనుంది. ఈ నెల 8, 9న భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న సదస్సులో.. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు సంబంధించిన ప్రధాన భాగస్వామ్యాలను ప్రకటించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఫుట్‌బాల్ క్రీడాకారుల అభివృద్ధికి వీలుగా రెండు కొత్త ఫిఫాఅయిఫ్ ఫుట్‌బాల్ అకాడమీలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించనుంది. ఈ అకాడమీలు ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ , అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య సహకారంతో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో దేశంలోనే తొలి మహిళా ఫుట్‌బాల్ అకాడమీని ప్రారంభించారు. అధికారంలోకి వచ్చిన నాటినుండీ ఒలింపిక్స్, కామన్ వెల్త్ గేమ్స్ నిర్వహణపై మాట్లాడుతూ తెలంగాణను క్రీడలకు ముఖ్య కేంద్రంగా మార్చడానికి, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రతిభావంతులను అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రమిస్తున్నారు. ఆ శ్రమకు రూపంగా అంతర్జాతీయ సదస్సు నిలవనుంది. ఇప్పుడు అదనంగా రానున్న ఈ రెండు అకాడమీలు రాష్ట్రంలో ఫుట్‌బాల్ వాతావరణాన్ని మరింత పటిష్టం చేస్తాయని భావిస్తున్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి మెస్సీతో ఆడబోతున్న ఎగ్జిబిషన్ మ్యాచ్, సీఎం ప్రాక్టీస్ పై క్రీడాకారుల్లో, విద్యార్థుల్లో ఎంతో ఉత్సుకత వ్యక్తమవుతోంది.

# రిజర్వేషన్ల పిటిషన్‌పై నేడు హైకోర్టులో విచారణ

**జీవో 9 రద్దు కోరుతూ మాధవరెడ్డి పిటిషన్**

**హైదరాబాద్, మహా:** బీసీ రిజర్వేషన్ల అంశంపై దాఖలైన కీలక పిటిషన్‌ను హైకోర్టు నేడు విచారించనుంది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన మాధవరెడ్డి దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 9 రద్దు చేయాలని కోరారు. ఈ జీవో కారణంగానే గతంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై హైకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. ఒకవేళ ఎన్నికలు నిర్వహించాలంటే పాత రిజర్వేషన్ల (పాత కోటా) ప్రకారమే జరగాలని ధర్మాసనం అక్టోబర్ 10న జారీ చేసిన ఆదేశాలలో పేర్కొంది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వ కౌంటర్ అఫిడవిట్ మరియు తదనంతర చర్యలపై న్యాయస్థానం నేటి విచారణలో దృష్టి సారించనుంది. మరోవైపు, బీసీ రిజర్వేషన్లపై మంగళవారం నాడు హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో, పంచాయతీ ఎన్నికల్లో గతంలో ఉన్న 23 శాతం రిజర్వేషన్లను అమలు చేయకుండా కావాలనే తగ్గించడం ద్వారా ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసిందని ఆరోపించారు. వెంటనే విచారణ చేపట్టి బీసీలకు న్యాయబద్ధమైన రిజర్వేషన్లు కేటాయించాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. ఈ రెండు ముఖ్యమైన పిటిషన్లపై హైకోర్టు నేడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని బీసీ వర్గాలు మరియు రాజకీయ వర్గాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.



# ఓటీటీలోకి వచ్చేసిన హారర్ మూవీ..

రష్మిక నటించిన రెండు సినిమాలు ఈ వారం ఓటీటీల్లోకి రాబోతున్నాయి. అందులో ఒకటి 'ద గర్ల్‌ఫ్రెండ్'. ఇది నెట్‌ఫ్లిక్స్‌లో శుక్రవారం నుంచి స్ట్రీమింగ్ కానుంది. మరోవైపు ఈ బ్యూటీ చేసిన హారర్ మూవీ కూడా ఇప్పుడు ఎలాంటి హడావుడి లేకుండా డిజిటల్‌గా అందుబాటులోకి వచ్చేసింది. ఇంతకీ ఏంటా సినిమా? ఎందులో చూడొచ్చు? రష్మిక ఓవైపు తెలుగు, మరోవైపు హిందీ మూవీస్ చేస్తూ ఫుల్ బిజీగా ఉంది. అలా ఈ ఏడాది దీపావళికి 'థామా' అనే హారర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. బాలీవుడ్‌లోని 'స్త్రీ' యూనివర్స్‌లో భాగంగా వచ్చిన చిత్రమిది. ఆయుష్మాన్ ఖురానా హీరోగా, నవాజుద్దీన్ సిద్ధిఖీ విలన్‌గా చేశాడు. ఇందులో రష్మిక.. రక్తం తాగే అమ్మాయి అంటే వ్యాంపైర్ పాత్రలో కనిపించింది. థియేటర్లలో ఓ మాదిరిగా ఆడినప్పటికీ ఈమె నటనకు మాత్రం మంచి మార్కులు పడ్డాయి.థియేటర్లలో అక్టోబరు 21న రిలీజైన ఈ సినిమా ఇప్పుడు అమెజాన్ ప్రైమ్ ఓటీటీలోకి వచ్చేసింది. తెలుగు, హిందీలో ప్రస్తుతానికి అద్దె విధానంలో స్ట్రీమింగ్ అవుతోంది. ఉచితంగా ఎప్పటినుంచి అనేది తెలియాల్సి ఉంది. 'థామా' విషయానికొస్తే.. అలోక్ గోయల్ (ఆయుష్మాన్ ఖురానా) ఓ జర్నలిస్ట్. ఫ్రెండ్స్‌తో కలిసి న్యూస్ కవరేజీ కోసం ఓ రోజు కొండ ప్రాంతానికి వెళ్తాడు. అక్కడ ఇతడిపై ఎలుగుబంటి దాడి చేయగా.. తడ్కా (రష్మిక) రక్షిస్తుంది. ఆమె బేతాళ జాతికి చెందిన యువతి. మనుషుల రక్తాన్ని తాగే అలవాటున్న వీళ్లకు ఎన్నో అతీత శక్తులుంటాయి. ఈ జాతికి నాయకుడు థామాగా పిలిచే యక్షాసన్ (నవాజుద్దీన్ సిద్ధిఖీ) చేసిన ఓ తప్పు కారణంగా బేతాళ జాతి అతడిని ఎన్నో దశాబ్దాలుగా ఓ గుహలో బందీగా ఉంచుతుంది. అలాంటి బేతాళ సామ్రాజ్యంలోకి అలోక్ వచ్చాడని తెలిసి.. ఆ జాతి వాళ్లు ఇతడిని శిక్షించే ప్రయత్నం చేయగా.. తడ్కా తప్పిస్తుంది. ఈ క్రమంలోనే అలోక్‌తో ప్రేమతో పడిన తడ్కా.. తన జాతిని విడిచి జనజీవనంలోకి వస్తుంది. తర్వాత వీళ్ల ప్రేమలో ఎలాంటి మలుపులు చోటుచేసుకున్నాయి. తడ్కా ఓ వ్యాంపైర్ అని అలోక్‌కి ఎప్పుడు తెలిసింది? ఈ కథకు 'భేడియా', 'ముంజ్యా', 'స్త్రీ 2' సినిమాలతో లింకేంటి? చివరకు ఏమైందనేదే మిగతా స్టోరీ.



# పూనమ్ పోస్ట్ ఎవరిని ఉద్దేశించి?




టాలీవుడ్‌లో అప్పట్లో హీరోయిన్‌గా పలు సినిమాలు చేసిన పూనమ్ కౌర్.. ఎప్పటికప్పుడు ఏదోలా వార్తల్లో నిలుస్తూనే ఉంటుంది. మరీ ముఖ్యంగా పవన్ కల్యాణ్, డైరెక్టర్ త్రివిక్రమ్‌పై గతంలో పలుమార్లు సంచలన కామెంట్స్ చేసింది. ప్రస్తుతానికి యాక్టింగ్ పూర్తిగా పక్కనబెట్టేసింది. కానీ సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు ఏదో ఒకటి ట్వీట్ చేస్తూ హాట్ టాపిక్ అవుతూ ఉంటుంది. ఇప్పుడు కూడా అలానే ఓ మహిళ గురించి పరోక్షంగా ప్రస్తవించింది. 'మన ఇల్లు బాగుండాలని పక్క ఇల్లు కూల్చేయడం సరికాదు. అది కూడా ఓ శక్తిమంతమైన బాగా చదువుకున్న ఎక్కువ ప్రాధాన్యం గల మనిషి ఇలా చేయడం చాలా బాధాకరం. డబ్బు ఏదైనా చేయిస్తుంది' అని పూనమ్ కౌర్ ట్వీట్ చేసింది. సరిగ్గా ఈమె ట్వీట్ చేసినప్పుడే సమంత మరో పెళ్లి చేసుకుంది. దీంతో పూనమ్.. సమంతని ఉద్దేశిస్తూనే ఈ ట్వీట్ పెట్టిందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. సమంతకు ఇది రెండో పెళ్లి. 'ద ఫ్యామిలీ మ్యాన్' దర్శకుల్లో ఒకడైన రాజ్ నిడిమోరునే వివాహం చేసుకుంది. రాజ్‌కి కూడా ఇది రెండో పెళ్లినే. 2015లో శ్యామోలి అనే మహిళతో ఇతడికి పెళ్లి జరిగింది. ఆమెకు మూడేళ్ల క్రితమే విడాకులు ఇచ్చేశాడని అంటున్నారు గానీ దాని గురించి పెద్దగా క్లారిటీ లేదు. అలాంటిది ఇప్పుడు సామ్‌రాజ్.. ఈశా ఫౌండేషన్‌లోని ఓ ఆశ్రమంలో ఒక్కటయ్యారు. ఈ విషయాన్ని స్వయంగా సమంతనే బయటపెట్టింది. కొన్ని ఫొటోలు కూడా పోస్ట్ చేసింది.



# ఆనంద్ దేవరకొండ కొత్త సినిమా టైటిల్ గ్లింప్స్ చూశారా..!

బేబీ మూవీతో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టిన జంట ఆనంద్ దేవరకొండ వైష్ణవి చైతన్య. ఈ ఒక్క మూవీతో అందరి కళ్లు తనవైపు తిప్పుకునేలా చేసింది వైష్ణవి చైతన్య. తన మాస్ నటనతో ఆడియన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంది. మరోసార ఈ జంట తెరపై కనిపిస్తే ఎలా ఉంటుంది. అదే నిజం చేయబోతోంది ఈ బేబీ జంట ఆనంద్ వైష్ణవి. తాజాగా వీరిద్దరు జంటగా నటిస్తోన్న చిత్రం ఎపిక్. ఈ మూవీ టైటిల్ అధికారికంగా ప్రకటించారు మేకర్స్. టైటిల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్ అనే పేరుతో రిలీజ్ చేసిన గ్లింప్స్ అభిమానులను అలరిస్తోంది. ఈ ప్రేమకథా చిత్రాన్ని 90స్ వెబ్‌సిరీస్‌లోని పాత్రలతో రూపొందిస్తున్నారు. తాజాగా విడుదలైన గ్లింప్స్‌లో ది శేఖర్ కమ్ముల సినిమాల్లో హీరోలాంటి అబ్బాయికి.. సందీప్ రెడ్డి వంగా సినిమాల్లో హీరో లాంటి అమ్మాయికి మధ్య జరిగే ప్రేమకథ అనే డైలాగ్ మరింత ఆసక్తిని పెంచుతోంది. కాగా.. ఈ మూవీకి 90s ఏ మిడిల్ క్లాస్ బయోపిక్ ఫేమ్ ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.



# అభిమానులకు విజువల్ ఫీస్ట్‌లా చిరంజీవి, వెంకటేశ్ సాంగ్..

టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి టైటిల్ రోల్ పోషిస్తోన్న చిత్రం మన శంకర వర ప్రసాద్‌గారు. అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ 'పండగకు వస్తున్నారు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోంది. లేడీ సూపర్ స్టార్ నయనతార ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తున్న ఈ చిత్రంలో వెంకటేశ్ గెస్ట్ రోల్‌లో నటిస్తున్నాడని తెలిసిందే. చిరంజీవి, వెంకటేశ్ కాంబోలో ఓ పాట కూడా ఉండగా షూటింగ్ కొనసాగుతుందంటూ వార్తలు కూడా వచ్చాయి.


తాజాగా దీనిపై అధికారిక అప్‌డేట్ వచ్చేసింది. ఈ సాంగ్ గ్లింప్స్ షేర్ చేశారు మేకర్స్. బ్యాక్ డ్రాప్ విజువల్స్ ఫైరింగ్ మోడ్‌లో ఉండగా.. చిరు, వెంకీ కలిసి నడుస్తూ థంబ్స్ అప్ సింబల్ చూపిస్తున్న గ్లింప్స్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. మెగా విక్టరీ మాస్ సాంగ్.. షూటింగ్ కొనసాగుతోంది అంటూ అనిల్ రావిపూడి టీం షేర్ చేసిన అదిరిపోయే సాంగ్ గ్లింప్స్ ఇంట్రో నెట్టింట వైరల్ అవుతూ పాటపై అంచనాలు మరింత పెంచేస్తుంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి విడుదల చేసిన మీసాల పిల్ల సాంగ్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది.

మరి వెంకీ, చిరు సాంగ్ ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందో చూడాలి. ఈ మూవీలో వీటీవీ గణేశ్, కేథరిన్ థ్రెసా, హర్షవర్ధన్, రేవంత్ భీమల (సంక్రాంతికి వస్తున్నాం) ఫేం బుల్లిరాజు) కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని షైన్ స్ర్కీన్స్ పతాకంపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల-విష్ణు ప్రసాద్ హోం బ్యానర్ గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ సినిమాకు మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీని 2026 సంక్రాంతి కానుకగా విడుదల చేయనుండగా.. రిలీజ్ డేట్‌పై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

# బాలీవుడ్‌లో అలా వస్తేనే స్టార్ హీరో : దుల్కర్ సల్మాన్

బాలీవుడ్‌లో స్టార్ హీరో అని గుర్తించాలంటే కచ్చితంగా లగ్జరీ కారు ఉండాల్సిందే అంటున్నాడు మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్. మలయాళ, తెలుగుతో పాటు అన్ని భాషల్లో సినిమాలు చేస్తూ అలరిస్తున్న దుల్కర్..తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన బాలీవుడ్ ఎంట్రీ అనుభవాన్ని పంచుకున్నాడు. హిందీలో స్టార్ హీరో అని చూపించుకోకపోతే.. కనీస మర్యాదలు కూడా చేయరని దుల్కర్ అన్నారు. బాలీవుడ్‌లో నటించేటప్పుడు నా చుట్టూ ఇద్దరు వ్యక్తులు ఉండేవాళ్లు. నేను సెట్‌లోకి వచ్చినప్పుడు వాళ్లు నన్ను రౌండప్ చేసి ఎవరూ దగ్గరకు రాకుండా చూసుకునేవాళ్లు. నేను స్టార్ హీరో అని నమ్మించడానికి అలా చేయాల్సి వచ్చింది. అక్కడ స్టార్ హీరో అని నిరూపించుకోకపోతే.. కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా వేయరు. మోనిటర్ చూడడానికి స్థలం కూడా ఇవ్వరు. చుట్టూ జనాలు..లగ్జరీ కారు ఉంటేనే మనల్ని స్టార్ అనుకుంటారు.

మలయాళంలో అలాంటి పరిస్థితి ఉండదు. సెట్‌కి ఎలా వచ్చినా సరే.. గౌరవిస్తారు. లగ్జరీకి ప్రాధాన్యత ఉండదు. ఇంటి నుంచే అన్నీ తెచ్చుకుంటాం. ఎక్కువ వరకు సొంత ఖర్చులే పెట్టుకుంటాం' అని దుల్కర్ చెప్పుకొచ్చాడు. 2018లో కార్వాన్ చిత్రంలో దుల్కర్ బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చాడు. ఇటీవల ఆయన 'కాంత' చిత్రంలో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు.





# ప్రభాస్ ది రాజా సాబ్ స్పెషల్ పోస్టర్..!

రెబల్ స్టార్ ప్రభాస్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రం " ది రాజా సాబ్". ఈ రొమాంటిక్ హారర్ కామెడీ చిత్రానికి మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన టీజర్, సాంగ్స్‌కు ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ఈ సినిమా థియేటర్లలో సందడి చేయనుంది. ఈ చిత్రంలో అత్తారింటికి దారేది నటుడు బోమన్ ఇరానీ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇవాళ ఆయన బర్త్ డే కావడంతో మేకర్స్ ప్రత్యేక పోస్టర్ రిలీజ్ చేశారు. ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ మూవీ టీమ్ స్పెషల్ పోస్టర్ పంచుకున్నారు. ఈ సినిమాలో సైకియాట్రిస్ట్, హిప్నాటిస్ట్, పారానార్మల్ ఇన్వెస్టిగేటర్‌గా బొమన్ ఇరానీ ప్రేక్షకులను ఆకట్టుకోనున్నారు. కాగా.. ఇందులో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లో టీజీ విశ్వప్రసాద్,కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ మూవీ జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. ఈ సినిమాకు తమన్ సంగీతమందిస్తోన్న సంగతి తెలిసిందే.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad, Telangana, IN - 500034